అగ్రనాయకులున్నా.. అప్‌గ్రేడ్‌కు నోచుకోలే!

- డిగ్రీ కళాశాలకు నోచుకోని అంబర్‌పేట నియోజకవర్గం
- అవకాశాలున్నా ప్రభుత్వ ఆదరణ కరువు
- ఇబ్బందుల్లో పేద, మధ్యతరగతి విద్యార్థులు


కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన సముదాయం

గబర్కత్‌పుర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అన్ని పార్టీలకు చెందిన అగ్ర నాయకులు అంబర్‌పేట నియోజకవర్గంలోనే నివసిస్తున్నా.. డిగ్రీ కళాశాలకు మాత్రం నోచుకోలేకపోవడం దురదృష్టకరం. ఎంతో మంది ఇక్కడి ప్రముఖులు రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగారు. ముఖ్యమంత్రులు సైతం ఈ నియోజకవర్గంలో అవాసం ఏర్పాటు చేసుకున్నారు. స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఎన్నో అవకాశాలున్నా.. పాలకుల నిర్లక్ష్యం వల్ల ఆచరణకు నోచుకోలేదు. ఎంతో మంది పేద, మధ్యతరగతి విద్యార్థులు డిగ్రీ చదవడానికి బయటి ప్రాంతాలకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

నిజాం హయాం నుంచే గుర్తింపు

అంబర్‌పేట నియోజకవర్గం నిజాం కాలం నుంచే ఎంతో గుర్తింపు పొందింది. నాటి నుంచి నేటి వరకు అంబర్‌పేట ప్రాంతానికి రాష్ట్రస్థాయిలోనే మంచి గుర్తింపు ఉంది. ఇంత చరిత్ర కలిగిన నియోజకవర్గంలో కేవలం ఒకే ఒక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉండడం గమనార్హం. కాచిగూడ జూనియర్ కళాశాల ఆవిర్భవించి ఐదు దశాబ్దాలు గడిచినా దానిని డిగ్రీ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయకపోవడం పాలకుల నిర్లక్ష్యానికి నిదర్శనం. నియోజకవర్గంలో దాదాపు మూడున్నర లక్షల జనాభా ఉంది. వారిలో డిగ్రీ, పీజీ స్థాయి విద్యనభ్యసించిన వారు 20 నుంచి 30 వేల మంది వరకు ఉంటారు. కాచిగూడ, నల్లకుంట, బాగ్అంబర్‌పేట డివిజన్లు ప్రైవేట్ విద్యా సంస్థలకు నిలయంగా మారాయి.

ప్రముఖులకు నివాసం నియోజకవర్గం

అంబర్‌పేట నియోజకవర్గంలో ఎంతో మంది ప్రముఖులు నివసించారు. నగర మొదటి కొత్వాల్ రాజా బహదూర్ వెంకట్రామ్‌రెడ్డి ఈ నియోజకవర్గం పరిధిలోనే ఆర్‌బీవీఆర్ రెడ్డి కళాశాల ఏర్పాటు చేశారు. నిజాం మంత్రివర్గంలో ఉన్న బర్కతుల్లాబేగ్ బర్కత్‌పురలోనే నివాసం ఉన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రులుగా పనిచేసిన బూర్గుల రామకృష్ణరావు, టి.అంజయ్యలు బర్కత్‌పురలోనే ఉన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీలు టి.మణెమ్మ, జి.సంజీవరెడ్డి, వి.హనుమంతరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీలు చుక్కా రామయ్య, ఇంద్రసేనారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన ప్రముఖులు ఈ నియోజకవర్గంలోనే ఉంటున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు మూడు సార్లు రాజ్యసభ సభ్యులుగా పనిచేశారు. చెన్నారెడ్డి, ఆలె నరేంద్ర, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్ ఇక్కడి వారే. అదే విధంగా ప్రస్తుత సీఎంకి బర్కత్‌పురతో విడదీయరాని అనుబంధం ఉంది. రేవంత్‌రెడ్డి హయాంలోనైనా డిగ్రీ కళాశాలకు మోక్షం లభిస్తుందని పలువురు విద్యార్థులు కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తా
- కాలేరు వెంకటేష్, అంబర్‌పేట ఎమ్మెల్యే

కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాలను అప్‌గ్రేడ్ చేసేంతా వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తా. ప్రతిపాదనలు రూపొందించి అందజేస్తా. డిగ్రీ కళాశాలను సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతా.

ఇటిక్యాల పురుషోత్తంకు సన్మానం

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్‌గా నియమితులైన ఇటిక్యాల పురుషోత్తంను ఆదివారం తెలంగాణ ఉద్యమకారులు జేఏసీ చైర్మన్, కాంగ్రెస్ గ్రేటర్ నాయకుడు సుల్తాన్ యాదగిరి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుజి, డి.వెంకటలక్ష్మి, సునీత, వి.అరుణ, కమల, జి.యాదగిరి, మోతుక్కురి మల్లేష్, యాదయ్య, పాపయ్య పాల్గొన్నారు


బతుకమ్మ పండగ లక్కీ డ్రా విజేతలకు బహుమతులు అందజేస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండగ
- ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఈనెల 10న జరిగిన సద్దుల బతుకమ్మ సందర్భంగా మహిళలకు ఇచ్చిన లక్కీ డ్రా కూపన్ల విజేతలకు ఆదివారం రాంనగర్ మీ సేవ చౌరస్తాలో బహుమతుల ప్రదానం జరిగింది. విజేతలు సృజన, జి.స్వప్న, ఐశ్వర్య కన్నంబాలకు బహుమతులను అందజేశారు.

చిరువ్యాపారుల ఉపాధిని దెబ్బతీయొద్దు

ముషీరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసే చిరు వ్యాపారులను ఇబ్బందులకు గురిచేయొద్దని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ జీహెచ్‌ఎంసీ అధికారులను హెచ్చరించారు. ఆదివారం ముషీరాబాద్ వాలీబాల్ గ్రౌండ్ నుంచి చౌరస్తా వరకు జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఫుట్‌పాత్‌పై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలను కూల్చివేయడంతో బాధితులు ముఠాగోపాల్‌కు ఫిర్యాదు చేశారు.

అంబర్‌పేట డబుల్ మర్డర్ కేసు..
- పోలీసుల దర్యాప్తు వేగవంతం

అంబర్‌పేట, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సాయిబాబా నగర్ కాలనీలో దారుణ హత్యకు గురైన రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి లింగారెడ్డి, ఊర్మిళ దంపతుల కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. హత్య కేసు లో అనుమానితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆదివారం విచారణ జరిపారు. అనుమానితుల జాబితాలో ఉన్న హతుల ఇంట్లో పనివారు, కొంపల్లిలో నివాసం ఉండే వారి పెద్ద అల్లుడి కారు డ్రైవర్‌ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించినట్లు తెలిసింది. ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతిక ఆధారాలు, సీసీ టీవీ ఫుటేజీలను జల్లెడ పడుతున్నారు. ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ జోగుల నర్సయ్య, కాచిగూడ ఏసీపీ రఘు ఈ కేసుకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించారు. అయితే దర్యాప్తు వివరాలు పోలీసులు ఇప్పటి వరకు వెల్లడించలేదు.

ముత్యాలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను శిక్షించాలి

ముషీరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరి గూడలోని ప్రసిద్ధి గాంచిన ముత్యాలమ్మ దేవాలయ విగ్రహం ధ్వంసం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ముషీరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ నాయకులు ముషీరాబాద్ సీఐ రాంబాబుకు వినతి పత్రం అందజేశారు. ఆదివారం ముషీరాబాద్ స్టేషన్‌లో సీఐని కలిసి వినతి పత్రం అందజేసిన అనంతరం బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ అహ్మద్ భక్తియార్, బోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు మహ్మద్ అలీ, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ సీనియర్ నాయకుడు ఖదీర్‌లు మాట్లాడుతూ... కొంత మంది స్వార్థంతో ఇతరుల మనోభావాలు దెబ్బతీసే విధంగా దాడులు, విధ్వంసాలకు పాల్పడడం హేయమైన చర్య అన్నారు. దేవాలయాలు, మసీదులు, చర్చిలపై దాడులు చేయడం పద్ధతి కాదన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మైనార్టీ కమిటీ నాయకులు జావిద్‌ఖాన్, మహ్మద్ మోహిన్, నజీమొద్దీన్, రఫీక్, మూసా, హాజీ తదితరులు పాల్గొన్నారు.


సీఐ రాంబాబుకు వినతి పత్రం అందజేస్తున్న ముషీరాబాద్ బీఆర్ఎస్ మైనార్టీ నాయకులు

జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారం ప్రారంభం


గోల్నాక డివిజన్ జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారాన్ని ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
చిత్రంలో కార్పొరేటర్ లావణ్యశ్రీనివాస్‌గౌడ్, చింతల శ్రీనివాస్ ముదిరాజ్

గోల్నాక, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గోల్నాక డివిజన్‌లోని జైస్వాల్‌గార్డెన్ కాలనీ ముఖద్వారాన్ని కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీనివాస్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కిషన్‌రెడ్డి స్థానిక కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ముఖద్వారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ ముఖద్వారం చిరునామాకు సంకేతంగా ఉంటుందన్నారు.

పాత పెన్షన్ విధానాన్నే కొనసాగించాలి


మాట్లాడుతున్న విద్యాసాగర్‌రెడ్డి

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పోస్టల్ శాఖను ప్రైవేట్ పరం చేయాలనే ఆలోచనను ఉప సంహరించుకోవాలని పోస్టల్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని అన్నారు. చీఫ్ పోస్టు మాస్టర్ జనరల్ తెలంగాణ సర్కిల్ హైదరాబాద్ డాక్టర్ పి.విద్యాసాగర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నేషనల్ యూనియన్ ఆఫ్ పోస్టల్ ఎంప్లాయిస్ పోస్టుమాన్ అండ్ ఎంపీఎస్‌జీఆర్ - సి తెలంగాణ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే సర్కిల్ సమావేశాల ప్రారంభ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్‌యూపీఈ సర్కిల్ సెక్రటరీ ఎం.కృష్ణ, హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డివిజన్ నాయకులు హైమావతి, వాసిరెడ్డి శివాజీ, నిసార్ ముజ్వార్, కృష్ణారావు, శంకర్‌గౌడ్, శ్రీకాంత్, హనుమంతరావు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీజీఓ ఈసీ సభ్యునిగా రామాంజనేయులు

చిక్కడపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా టీజీవో కార్యవర్గ సభ్యునిగా చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఈవో, తెలంగాణ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు కురుమ రామాంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

ఎల్లమ్మ దేవాలయ వార్షికోత్సవం

బర్కత్‌పుర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ ఆర్టీసీ డిపో పక్కన ఉన్న ఎల్లమ్మ దేవాలయం 15వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఘనంగా జరిగాయి. ఆలయ కమిటీ చైర్మన్ ఎస్.సత్యేందర్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేడుకల్లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నర్సింగ్‌యాదవ్, గోపగాని శ్రీనివాస్‌గౌడ్, ఎర్ర భీష్మాదేవ్, బి.కృష్ణగౌడ్, కృష్ణంరాజు, ఆర్.వి.ఎల్.రమేష్, అజారి రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

దీపాలతోనే దీపావళి జరుపుకుందాం

- పర్యావరణాన్ని కాపాడుకుందాం
- ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మల్లం రమేష్, కె.వీరయ్య తదితరులు

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : దీపాలతోనే దీపావళి జరుపుకోవడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకుందామని ప్రముఖ మిమిక్రీ కళాకారుడు మల్లం రమేష్ పిలుపునిచ్చారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో హైదరాబాద్ జిందాబాద్, సిటిజన్స్ ఫోరం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందల సంవత్సరాల నుంచి మన సాంప్రదాయం ప్రకారం దీపాలతోనే దీపావళి జరుపుకుంటున్నామని అన్నారు. పటాకులలో వాడే రసాయనాలు చాలా ప్రమాదకరమైనవని సీసం, పొటాషియం, క్రోమియం, సల్ఫర్ డై ఆక్సైడ్, నైట్రోజన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మెగ్నీషియం వంటి అనేక రసాయనాలు నాడీ వ్యవస్థను దెబ్బతీస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిందాబాద్ ప్రధాన కార్యదర్శి కె.వీరయ్య, నాయకులు నాగేశ్వరరావు, పి.శ్రీనివాస్‌రావు, మోహన్‌నాయుడు, రాజమౌళి, సంగీత, లలిత, శ్రీవల్లి, మేఘన, శ్వేత, సైదులు, నాగేష్, గోపాల్, శంకర్, రఘు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల తర్వాతే రోడ్డు పనులు చేపట్టాలి

- కాంగ్రెస్ పార్టీసీనియర్ నాయకుడు సయ్యద్ మసూద్



భోలక్‌పూర్ డాక్టర్ సందాని వీధిలో నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మసూద్

ముషీరాబాద్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లోని డాక్టర్ సందాని వీధిలో గత 10 సంవత్సరాలుగా డ్రైనేజీ సమస్యతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని భోలక్‌పూర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సయ్యద్ మసూద్ పేర్కొన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులు చేపట్టకముందే తమ వీధిలో సీసీ రోడ్డు వేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఆదివారం భోలక్‌పూర్ డివిజన్‌లోని డాక్టర్ సందాని వీధిలో స్థానికుల ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మసూద్ సందాని వీధిలో ప్రజలకు మద్దతుగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు యాకత్ అలీ, సలీం, ఇషాక్, చిద్రి, నాయకులు రమేష్, విజయలక్ష్మీ, మంజుల పాల్గొన్నారు.


వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

లైబ్రరీలో వైద్యశిబిరానికి స్పందన

చిక్కడపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): చిక్కడపల్లి సిటీసెంట్రల్ లైబ్రరీలో అగర్వాల్ మానవ్ సేవామంచ్ ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా పలు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

వైభవంగా దసరా మిలాప్ వేడుకలు

బర్కత్‌పుర, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో ఆదివారం ఆరుంధతీయ బంధు సేవా మండలి ఆధ్వర్యంలో 42వ వార్షికోత్సవ వేడుకలు, దసరా మిలాప్ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. జంటనగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి ఆరుంధతీయ బంధు సేవా మండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉచితంగా సామూహిక వివాహాలు

రాంనగర్, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి) : సగర (ఉప్పర) కులంలో పేద వారికి యేటా సామూహిక వివాహాలు ఉచితంగా నిర్వహించేందుకు తమ కమిటీ నిర్ణయం తీసుకుందని అఖిల భారత సగర మహాసభ చైర్మన్ గణపతి ప్రభాకర్‌రావు, వైస్ చైర్మన్ ముత్యాల హరికిషన్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సగర క్షత్రియ వెల్ఫేర్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో వివాహ పరిచయ వేదిక జరిగింది.

రోడ్డుపైనే సామగ్రి.. పాదచారులకు ఇబ్బందులు


రోడ్డుపై ఇంటి నిర్మాణ సామగ్రి

చిక్కడపల్లి, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని అశోక్‌నగర్, గాంధీనగర్, జవహర్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలు చేసేవారు నిర్మాణసామగ్రిని రోడ్లపై వేయడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. 20 నెంబర్ బస్సు వెళ్లే అశోక్‌నగర్ బ్రిడ్జి సమీపంలో, జవహర్‌నగర్ మెయిన్‌రోడ్డులో, లింక్‌బ్రిడ్జి వద్ద రోడ్డుపై నిర్మాణ సామగ్రి పడేశారు. దీంతో పాదచారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లపై నిర్మాణసామగ్రి వేసేవారిపై చర్యలు తీసుకోవాలని పలువురు వాహనచోదకులు కోరుతున్నారు.


సాయిబాబా సమాధి ఉత్సవాల్లో పూజలు నిర్వహిస్తున్న నగర కాంగ్రెస్ నాయకులు సిరిపల్లి శంకర్, ఆర్.మహేష్

కవాడిగూడ, అక్టోబరు 20 (ఆంధ్రజ్యోతి):కవాడిగూడ డివిజన్ తాళ్లబస్తీలో శ్రీసాయి ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే శ్రీ షిరిడీసాయిబాబా 40వ సమాధి ఉత్సవాలు ఆదివారం భక్తి శ్రద్ధలతో ముగిశాయి. ముగింపు సందర్భంగా రాష్ట్ర పీసీసీ నాయకులు హరికృష్ణ, నగర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి బీరం కిట్టు, నగర కాంగ్రెస్ నాయకులు సిరిపల్లి శంకర్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులను నిర్వాహకులు ఆర్ మహేష్ శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు.


రాంనగర్ రామాలయంలో శ్రీదేవి నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఒడిబియ్యం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆనంద్ ముదిరాజ్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆలిండియా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు లాల్‌వర్మ హరియాను ఆదివారం ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, ప్రధాన కార్యదర్శి క్రాంతికిరణ్, రాష్ట్ర ఎస్సీ మోర్చా ఆఫీస్ సబ్ ఇన్‌చార్జి మీసాల విఠల్‌రావు, మొగ్గయ్య ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి సన్మానించారు. -(కవాడిగూడ, ఆంధ్రజ్యోతి)